# సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 15 । మార్చి । 2024






## మండు వేసవిలో జలసిరి

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు మండుటెండలో సైతం నిండుకుండలా దర్శనమిస్తోంది. నీటితో కళకళలాడుతోంది.

10లో▸



## క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజర్ బోర్డు మెంబర్ మహేశ్ సూచించారు.

10లో▸

### రంజాన్ వేళలు

| ఇఫ్తార్ : | సహర్ : |
|---|---|
| శుక్రవారం (సాయంత్రం) 6:31 | శనివారం (ఉదయం) 5:02 |

# ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షలు ముగియడంతో హాస్టల్ ఖాళీ చేసి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

### చివరి రోజు ప్రశాంతంగా పరీక్ష

- ఊపిరిపీల్చుకున్న అధికార యంత్రాంగం
- నేటి నుంచి ఒంటిపూట బడులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ద్వితీయ సంవత్సరంలో చివరిరోజు 68,268 విద్యార్థులకు గాను 66,298 మంది పరీక్షకు హాజరయ్యారు. అదేవిధంగా ఫస్ట్ ఇయర్‌లో 80,320 మంది విద్యార్థులకు గాను 77,722 మంది పరీక్ష రాశారు.ఎలాంటి మాల్ ప్రాక్టీస్,డీబార్ కేసులు నమోదు కాలేదు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఎంఆర్ ఎంఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మారేడ్‌పల్లిలో ఇప్పటికే సంస్కృతం ప్రశ్నాపత్రాల మూ ల్యాంకనం ప్రారంభమవ్వగా శనివారం నుంచి మెయిన్ సబ్జెక్టుల మూల్యాంకనం కొనసాగనుంది. ఏప్రిల్ నెలాఖరు వరకు ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది.వేసవి సెలవులు ప్రకటించడంతో ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీల్లో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. విద్యార్థులను తీసుకెళ్లేందుకు వారి తల్లిదండ్రులు హాస్టళ్ల వద్దకు చేరుకున్నారు. ఇప్పుడు విద్యార్థులంతా జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు.

**నేటి నుంచి ఒంటిపూట బడులు..**

వేసవి నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి ప్రభుత్వం ఒంటిపూట బడులను ప్రకటించింది. టెన్త్ వార్షిక పరీక్షా కేంద్రాలు ఎంపిక చేసిన పాఠశాలల్లో.. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలు ఎంపిక చేయని పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ నిబంధనలను తప్పనిసరి పాటించాల్సిందిగా జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు పాటించకుండా ఎవరైనా రెండుపూట తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శశాంక

# నోడల్ అధికారులదే కీలక పాత్ర

- 18 నుంచి టెన్త్ పరీక్షలు షురూ
- ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టర్ శశాంక సమీక్ష
- కాపీయింగ్‌కు ఆస్కారం ఇవ్వొద్దని సూచన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని విషయాలపై నోడల్ టీంలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత పీఓ, ఏపీఓలకు సైతం శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత స్వీప్ నోడల్ అధికారికి సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను శాఖల వారీగా అందించాలని సూచించారు. సిబ్బందికి సంబంధించిన ఇంటి చిరునామాలు, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సీపీఓ సౌమ్య, డీసీఓ ధాత్రిదేవి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, ఎన్నికల విభాగం అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

**కాపీయింగ్‌కు ఆస్కారం ఇవ్వొద్దు..**

పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 239 పరీక్ష కేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని.. ఆయ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించా రు. పరీక్షల నిర్వహణలో చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం ఇవ్వొదని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఖచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడపాలని కోరారు. పరీక్ష కేంద్రంలో మొబైల్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశ వర్కర్లు, అవసరమైన మందులు ప్రతి పరీక్ష కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్ష సమయానికి ముందే రావడంతో పాటు చివరి దాకా ఉండాలని అన్నారు. కాపీయింగ్ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షణ జరపాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ధరణిపై ఆందోళన వద్దు

- భూసమస్యలన్నీ పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

యాచారం: ప్రభుత్వ భూములు కాజేయాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ సర్కార్ ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గునుగల్‌కు చెందిన పలువురు రైతులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసి భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధరణి పోర్టల్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిటీని నియమించిందని... ఆ కమిటీ ఇప్పటికే అనేక సమస్యలను గుర్తించిందని తెలిపారు. ఈ మేరకు భూసమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని భూ సమస్యలపై ఆర్డీఓ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గునుగల్‌లో అయ్యప్పస్వామి దేవాలయం కోసం స్థలం కేటాయించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు లక్ష్మణ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### 3 నెలల్లో 439 అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. గత మూడు నెలల్లో 439 అక్రమ నిర్మాణాలను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గుర్తించి కూల్చివేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. అయితే టీఎస్ బీపాస్ అమల్లోకి వచ్చిన తర్వాత స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటైనప్పటి నుంచి మొత్తం ఎన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లు తగిన చర్యలు తీసుకోవడంలేదని ఎంతో కాలంగా ఆరోపణలున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేవలం మూడునెలల్లో తీసు కున్న చర్యల వివరాలను వెల్లడించారు. ఈ కూల్చివేతల్ని ప్రస్తావిస్తూ ప్రజలు అక్రమ నిర్మాణాలు, డీవియేషన్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### లోక్‌సభ ఎన్నికలతోపాటే 'కంటోన్మెంట్'!

- సన్నాహాలు చేస్తున్న అధికార యంత్రాంగం
- ఎమ్మెల్యే లాస్యనందిత మృతితో అనివార్యమైన ఉపఎన్నిక

కంటోన్మెంట్: పార్లమెంట్ ఎన్నికలతోపాటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక జరగనుంది. ఈ మేరకు దానికి సంబంధించిన అధికారిక ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. గత నెల 23న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే సార్వత్రిక ఎన్నికలకు ఒకట్రెండు రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. వీటితోపాటే దేశవ్యాప్తంగా వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సంబంధించి అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ధ్రువీకరణ కూడా పూర్తయింది. ఈ మేరకు ఉపఎన్నిక నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులు, కింది స్థాయి సిబ్బందికి సూచించినట్లు తెలుస్తోంది.

**232 పోలింగ్ బూత్‌లు...**

కంటోన్మెంట్ పరిధిలో 232 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మూడు బూత్‌లలో ఉపకేంద్రాలు కూడా ఉన్నాయి. మొత్తంగా ఇక్కడ ఎన్నికల నిర్వహణకు 235 ఈవీఎంలు అవసరమవుతాయి. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 16 లేదా అంతకు మించితే, తదనుగుణంగా రెట్టింపు ఈవీఎంలు అవసరం అవుతాయి.

## నేటి నుంచి టీఎస్ సిరీస్ స్థానంలో 'టీజీ'

# ఇక బండికి 'టీజీ'

- గ్రేటర్‌లో రోజుకు 2 వేలకుపైగా కొత్త వాహనాల నమోదు
- ప్రత్యేక నంబర్ల రిజర్వేషన్లు కూడా ప్రారంభం
- ఇప్పటికే బిడ్డింగ్ అయినవాటికి పాత సిరీస్ నంబర్లే..
- నగరంలో ఇక మూడు రకాల సిరీస్ వాహనాల దర్శనం

సాక్షి, సిటీబ్యూరో: బండి నంబర్‌ప్లేట్‌పై ఇక నుంచి టీఎస్‌కు బదులు 'టీజీ'సిరీస్ రానుంది. శుక్రవారం (నేటి) నుంచి టీజీ సిరీస్‌పైనే వాహనాలు రిజిస్టర్ అవుతాయి. ఈ మేరకు 'టీజీ'కి కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత 'టీఎస్'స్థానంలో రవాణాశాఖ కొత్తగా 'టీజీ'సిరీస్‌ను ప్రవేశపెట్టింది. సాధారణ నంబర్ల పైన రిజిస్టర్ చేసుకొనే వాహనాలతోపాటు ప్రత్యేక నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకొనే వాహనదారులు కూడా శుక్రవారం నుంచి 'టీజీ'సిరీస్ పైనే తమకు నచ్చిన నంబర్లకు బిడ్డింగ్ దాఖలు చేయవచ్చు. అయితే ఇప్పటికే టీఎస్ సిరీస్ నంబర్ల పైన ఆన్‌లైన్ బిడ్డింగ్ చేసిన వాహనదారులకు మాత్రం పాత నంబర్లనే కేటాయించనున్నట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) రమేష్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకాలంలో 'తెలంగాణ'అనే పదానికి సంక్షిప్తరూపంగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'టీజీ'సిరీస్ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అమల్లోకి వస్తుందని అప్పట్లో అందరూ భావించారు. ఈ మేరకు కొందరు తమ వాహనాలకు 'టీజీ'అని ప్రత్యేకంగా స్టిక్కర్లు కూడా అతికించుకున్నారు. కానీ, అప్పటి ప్రభుత్వం అందరి అంచనాలకు భిన్నంగా 'టీజీ'కి బదులు 'టీఎస్'ను అమల్లోకి తెచ్చింది. దీంతో గత పదేళ్లుగా 'టీఎస్' సిరీస్‌పైనే కొత్త వాహనాలు రవాణా శాఖ వద్ద నమోదయ్యాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాహనాల రిజిస్ట్రేషన్ సిరీస్‌ను 'టీఎస్'నుంచి 'టీజీ'గా మార్చాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్రం నుంచి తాజాగా ఆమోదం కూడా లభించడంతో కొత్త 'టీజీ'సిరీస్‌కు రూట్ క్లియర్ అయింది.

**కొత్త సిరీస్ ఇలా...**

గ్రేటర్ హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, మెహదీపట్నం, అత్తాపూర్, మలక్‌పేట్, సికింద్రాబాద్, ఉప్పల్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, కూకట్‌పల్లి, బండ్లగూడ కార్యాలయాల్లో ప్రతీరోజు 2 వేలకు పైగా కొత్త వాహనాలు నమోదవుతున్నాయి. వీటిలో సుమారు 1,500 వరకు ద్విచక్ర వాహనాలుకాగా, మిగతావి కార్లు, ఇతర రవాణా వాహనాలు ఉన్నాయి. వాహనాల కొనుగోలు సమయంలోనే షోరూమ్‌లలో డీలర్ల వద్ద తాత్కాలిక నంబర్లపై నమోదు చేస్తారు. అనంతరం శాశ్వత రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లవలసి ఉంటుంది. ఈ క్రమంలో రవాణాశాఖ ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేసే 10 వేల నంబర్లపైన వాహనాలను నమోదు చేస్తుంది. ప్రతీ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఏ రోజుకారోజు నమోదయ్యే వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఈ నంబర్లను విడుదల చేస్తారు. ప్రతీరోజు విడుదల చేసేవాటిలోనే వాహనదారులు తమకు నచ్చిన ప్రత్యేక నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ చేయవచ్చు. '9999', '999', '1234', '6666'వంటి ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనదారులు రూ.లక్షలు చెల్లించి పోటీ పడటం గమనార్హం. కొత్త సిరీస్ ప్రకారం... ఖైరతాబాద్‌లో నమోదయ్యే వాహనాలు 'టీజీ 09 -001'నుంచి ప్రారంభమవుతాయి. అన్ని చోట్ల మొదట్లో 001 నుంచే సిరీస్ ప్రారంభం కానుంది. ఉదాహరణకు మెహదీపట్నం టీజీ 13 -001, మలక్‌పేట్ టీజీ 11 -001, సికింద్రాబాద్ టీజీ10 -001, బండ్లగూడ టీజీ12 -001గా ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలోని అత్తాపూర్ టీజీ7-001, ఇబ్రహీంపట్నం కార్యాలయాల్లో టీజీ 7ఏ -001గా, మేడ్చల్ 8-001, ఉప్పల్ టీజీ 8ఏ -001, కూకట్‌పల్లి కార్యాలయంలో 8బీ-001 కొత్త సిరీస్ ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

**పాత సిరీస్ వద్దంటే డబ్బులు లాస్...**

'టీఎస్'సిరీస్‌పైన ప్రత్యేక నెంబర్‌ల కోసం ఇప్పటికే పోటీపడ్డ వాహనదారులు ఈ సిరీస్ ముగిసే వరకు అంటే.. మరో 15 రోజులపాటు తాము ఎంపిక చేసుకున్న నంబర్లపై(పాత టీఎస్ ప్రకారం) వాహనాలను నమోదు చేసుకోవలసి ఉంటుంది. టీఎస్ వద్దనుకుంటే మాత్రం ఆన్‌లైన్ ఇప్పటికే బిడ్డింగ్‌లో చెల్లించిన డబ్బులు కోల్పోవలసిందేనని జేటీసీ రమేష్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పాత సిరీస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నంబర్లను యథావిధిగా వినియోగించుకోవడం మంచిదని ఆయన సూచించారు.

**సిటీలో ఇక ట్రిపుల్ సిరీస్ చూడొచ్చు...**


తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో 'ఏపీ'సిరీస్‌పై నమోదైన వాహనాలు గ్రేటర్ హైదరాబాద్‌లో లక్షలాదిగా ఉన్నాయి. రాష్ట్రం అవతరించిన తరువాత 'టీఎస్'సిరీస్ ప్రారంభమైనప్పటికీ పాత 'ఏపీ'సిరీస్‌ను అలాగే ఉంచారు. ప్రస్తుతం 'టీఎస్'స్థానంలో 'టీజీ'వచ్చినప్పటికీ ఈ పదేళ్లలో 'టీఎస్'పైన నమోదైన వాహనాలు యథావిధిగా అలాగే ఉంటాయని జేటీసీ వివరించారు. కొత్తగా నమోదయ్యే వాటికి మాత్రమే 'టీజీ'రానుంది. దీంతో నగరంలో ఇక నుంచి 'ఏపీ', 'టీఎస్' 'టీజీ'అనే మూడు రకాల సిరీస్ వాహనాలు దర్శనమివ్వనున్నాయి.

## ఎమ్మెల్యే వీర్లపల్లికి అస్వస్థత

షాద్‌నగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గురువారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ఆయన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వడదెబ్బకు గురైన ఎమ్మెల్యేకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. కొందుర్గులో ప్రచారం ముగిసిన వెంటనే ఎమ్మెల్యేను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పామని.. నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

# నేడు మోదీ షో!

- సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి మల్కాజిగిరికి.. అనంతరం తిరిగి రాజ్‌భవన్‌కు ప్రధాని..
- ఆ మార్గాల్లో ట్రయల్ రన్ నిర్వహించిన పోలీసులు





సాక్షి, సిటీబ్యూరో/ మల్కాజిగిరి/ సనత్‌నగర్: మల్కాజిగిరిలో నేడు సాయంత్రం 5.15 గంటలకు జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రోడ్‌షోకు సర్వం సిద్ధమైంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ మరి కొద్దిరోజుల్లో వెలువడనున్న తరుణంలో ప్రధానమంత్రి రోడ్ షో బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపనుంది. మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ నేతలు మల్కాజిగిరిలో రోడ్‌షో ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు ఇప్పటికే ఏర్పాటు చేశారు.

**రోడ్ షో ఇలా...**

- ప్రధాని మోదీ రోడ్ షో మీర్జాలగూడ చౌరస్తా నుంచి సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభం కానున్నది.
- సుమారు 1.3 కిలోమీటరు దూరంలో ఉన్న మల్కాజిగిరి చౌరస్తా వరకు రోడ్‌షో జరుతుంది.
- మల్కాజిగిరి చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ ప్రసంగించే అవకాశం వుంది.
- దారి పొడవునా సుమారు 60 స్వాగత వేదికలు ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రజలతోపాటు పార్టీ నాయకులు స్వాగతం పలికేందుకు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.
- రోడ్‌షోలో భాగంగా సుమారు ముప్పై కార్లతో కాన్వాయి ట్రైల్ రన్ నిర్వహించారు.

**రాచకొండ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు**

ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన భద్రతా చర్యల్లో భాగంగా రోడ్ షో జరిగే ప్రాంతం చుట్టూ నిషేధాజ్ఞలు విధిస్తూ కమిషనర్ తరుణ్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఎయిర్ బెలూన్లు, రిమోట్ కంట్రోల్ డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్, ప్యారా గ్లైడింగ్‌లను నిషేధించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రోడ్ షో ముగిసే వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.

**రహదారి మళ్లింపులు ఇలా..**

- మెట్టుగూడ నుంచి మీర్జాలగూడ క్రాస్ రోడ్, నేరెడ్‌మెట్ వైపునకు వచ్చే ప్రయాణికులు శాంతినగర్ టీ జంక్షన్ వద్ద మళ్లించి, లాలాపేట మీదుగా జెడ్‌టీసీ, మౌలాలి, రమాదేవి, ఈసీఐఎల్ మీదుగా నేరెడ్‌మెట్‌కు చేరుకోవాలి.
- నేరెడ్‌మట్, వినాయక్‌నగర్, సఫిల్‌గూడ జంక్షన్ మీదుగా మల్కాజ్‌గిరి క్రాస్ రోడ్స్‌కు వచ్చే వాహనదారులు ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్ వద్ద మలుపు తీసుకొని ఉత్త మ్ ఆర్ యూబీ మీదుగా ఉత్తమ్ నగర్, ఏఓసీ రూట్, సికింద్రాబాద్ మీదుగా వెళ్లిపోవాలి.
- జెడ్‌టీసీ జంక్షన్ నుంచి ఆనంద్‌బాగ్‌కు వచ్చే వాహనాలు జెడ్‌టీసీ వద్ద మళ్లించి, మౌలాలి, రమాదేవి, ఈసీఐఎల్, నేరెడ్‌మెట్, వినాయక్‌నగర్ మీదుగా వెళ్లిపోవాలి.

**మోదీ రాక.. భద్రత కట్టుదిట్టం**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల(నేడు, రేపు) నగర పర్యటన దృష్ట్యా భద్రతను కట్టుదిట్టం చేశారు. మోదీ విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న నేపథ్యంలో దానిని కేంద్ర బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఎయిర్‌పోర్ట్ పరిసరాలను అణువణువూ జాగిలాలతో జల్లెడ పట్టాయి. ప్రధాని పయనించే మార్గాల్లో పోలీసులు గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. నేడే మోదీ రోడ్ షో పూర్తిచేసుకుని తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. శనివారం ఉదయం 10.40 నుంచి 11.15 మధ్య రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.

### నేడు,రేపు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రధాని మోదీ రెండు రోజుల నగర పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ విభాగం తెలిపింది. శుక్రవారం సాయంత్రం 4.40 నుంచి 7 గంటల మధ్య బేగంపేట, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ ఎక్స్‌రోడ్డు, ఆలుగడ్డ బావి, మెట్టుగూడ, రైల్వే హాస్పిటల్, మెట్టుగూడ రోటరీ, మీర్జాలగూడ టి-జంక్షన్, మల్కాజిగిరి ఆర్చి, లాలాపేట్, తార్నాక, గ్రీన్‌ల్యాండ్స్, మోనప్ప జంక్షన్, రాజ్‌భవన్, ఎంఎంటీఎస్ జంక్షన్, వీవీ విగ్రహం మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. ఆయా మార్గాల్లో వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించింది. అదేవిధంగా శనివారం ఉదయం 10.40 నుంచి 11.15 గంటల మధ్య ప్రధానమంత్రి రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి వెళ్తారు. ఆ సమయంలో వీవీ విగ్రహం, మెట్రో రెసిడెన్సీ లేన్, ఎంఎంటీఎస్ రాజ్‌భవన్, హెచ్‌పీఎస్ ఔట్ గేట్, బేగంపేట ఫ్లైఓవర్, పీఎన్‌టీ ఫ్లైఓవర్, ఎయిర్‌పోర్ట్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని వివరించింది.

### పార్కింగ్‌లు ఇక్కడే..

రోడ్ షోకు హాజరయ్యేవారు తమ వాహనాలను అనుటెక్స్ పెట్రోల్ బంక్, అషూర్‌ఖానా మైదానం, ప్రశాంత్ నగర్, జైన్ కన్‌స్ట్రక్షన్, సఫిల్‌గూడ ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల లోపు పార్కింగ్ చేయాలి. ఆ సమయం తర్వాత పార్కింగ్ చేయడానికి అనుమతి లేదు.

# సల్లంగ చూడు తల్లీ

- మన్సాన్‌పల్లిలో ఎల్లమ్మ బోనాలు ప్రారంభం
- ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవతా బోనాల జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఘటాల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ట్రస్టీ, చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, మాజీ జెడ్పీటీసీ నేనావత్ ఈశ్వర్ నాయక్, మన్సాన్‌పలి మాజీ సర్పంచ్‌లు కంది అరుణరమేష్, మల్లేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత జాన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



సర్దార్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు క్యారం బోర్డు అందజేస్తున్న మహేశ్

నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజర్ బోర్డు మెంబర్ మహేశ్

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజర్ బోర్డు మెంబర్ దాదె మహేశ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్యారం బోర్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ పాఠశాలల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అనురాధ, లిఖిత, వనజ, గ్రామస్తులు నరేశ్, ఆకృతి ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ నవిత తదితరులున్నారు.

# మద్యం మానేయమన్నందుకు..

యువకుడి బలవన్మరణం



బిష్ణు మజహి మృతదేహం

కందుకూరు: మద్యం మానేయమని చెప్పినందుకు ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం నుపడా జిల్లా కొత్తిపాడ గ్రామానికి చెందిన బిష్ణు మజహి(27) తన అక్క జయ మజహి నివాసం ఉండే రాచులూరు పరిధిలోని ఇటుక బట్టీల వద్ద మూడు నెలలుగా ఉంటున్నాడు. కూలీ పనులకు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి కుటుంబసభ్యులు భోజనం చేస్తున్న సమయంలో బిష్ణు అక్క మద్యం మానేయాలని సూచించింది. దీంతో అలిగి ఇంట్లోంచి వెళ్లి సమీపంలోని చింతచెట్టుకు టవల్‌తో ఉరేసుకున్నాడు. కాసేపటి అతని బావ వెతుకుతుండగా చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించి కూలీల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. గురువారం మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు

మొయినాబాద్: జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం) జిల్లా అధికారి శైలజకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ రిటైల్, స్టార్ బజార్, రత్నదీప్ సూపర్‌మార్కెట్, కేఎస్ బేకర్స్ వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంపికైన వారు అల్వాల్, కర్మన్‌ఘాట్, గచ్చిబౌలి, బాచుపల్లి, బీఎన్ రెడ్డి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు జీతం రూ.16వేలు. కటింగ్స్ పోను రూ.12వేలు వస్తుందని చెప్పారు. టెన్త్, ఇంటర్ పాసై 18–35 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు సర్టిఫికెట్లతోపాటు ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, అడ్రస్, సెల్ నెంబర్‌తో చిలుకూరులోని మహిళా ప్రాంగణంలో సంప్రదించాలన్నా రు. వివరాలకు 7660022524 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండా రోడ్డులోని ఓ వెంచర్‌లో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ బాల్‌రాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంచర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడన్న సమాచారంతో పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు 70 ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉంటాడని ఎస్ఐ తెలిపారు.

# మండు వేసవిలో జలసిరి

కుతుబ్‌షాహీల వైభవానికి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ప్రతీక. దాదాపు 470 ఏళ్ల క్రితం నిర్మించిన చెరువుతో స్థానికులకు ప్రత్యేక అనుబంధం ఉంది. ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో సైతం నీటితో తళుకులీనుతోంది.

- నీటితో కళకళలాడుతున్న పెద్ద చెరువు
- కట్టను పర్యాటక కేంద్రంగా చేయాలని స్థానికుల విజ్ఞప్తి



పెద్ద చెరువు గోపురం

యాచారం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు మండు టెండలో సైతం నిండుకుండలా దర్శనమిస్తోంది. రెండేళ్ల కింద కురిసిన భారీ వర్షాలకు చెరువు పుల్‌గా నిండి అలుగు పారింది. గతేడాది వర్షాలు కురవకపోయిన చెరువులో నీళ్ల మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం ఈ చెరువులో కొద్దిగా నీళ్ల తగ్గుముఖం పట్టినట్లు అనిపిస్తున్న మరో రెండేళ్ల పాటు నీళ్లకు ఢోకా ఉండబోదని రైతాంగం గంపెడెశలు పెట్టుకుంది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు ప్రస్తుతం ఎండిపోయాయి. గతేడాది నుంచి సమృద్ధిగా వర్షాలు లేకపోయిన చెరువులో నీరు పుష్కలంగా ఉంది. చేవేళ్ల మండలం చందనవెల్లి గ్రామం దగ్గర మూసీనది నుంచి ఫిరంగి నాలా ద్వారా ఈ పెద్ద చెరువుకు వరద నీరు చేరుతుంది. చెరువు నీటి నిల్వ సామర్థ్యంలో 70 శాతంతో ప్రస్తుతం కళకళలాడుతోంది. గతంలో ఫిరంగి కాల్వ కబ్జాలకు గురి కావడంతో కొన్నేళ్ల పాటు చెరువులోకి వరద నీరు నిలిచిపోయింది. మూడేళ్ల కింద కురిసిన భారీ వర్షాలకు ఫిరంగి నాలాలో నిర్మించిన అక్రమ కట్టడాలు కొట్టుకుపోయి భారీ వరద నీరు వచ్చి చేరుతోంది.

**పెరిగిన భూగర్భ జలాలు**

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో నీరు సమృద్ధిగా ఉండడంతో నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని గ్రామాలతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన దాదాపు 200కు పైగా గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, చిట్యాల ప్రాంతాల్లో బోరుబావుల్లో పుష్కలంగా భూగర్భజలాలు ఉంటాయి. సమీప గ్రామాల్లో దాదాపు 20 వేలకు పైగా బోరుబావుల్లో భూగర్భ జలాలు లభిస్తున్నాయి. 25 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది.

**మత్స్య సంపద**

పెద్ద చెరువు మత్స్య సంపదకు నిలయంగా మారింది. నాలుగైదు ఏళ్లుగా ఈ చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. స్వచ్ఛమైన నీరు ఉండడంతో ఇక్కడ లభించే చేపలకు మంచి డిమాండ్ ఉంది. చేపలను మత్స్యకారులు స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో హైదరాబాద్ నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. స్థానికులు కూడా ఎంతో ఇష్టంగా చెరువులో పెరిగే చేపలను కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు ఏళ్లగా రూ.కోట్ల విలువ జేసే మత్స్య సంపదను పట్టి మత్స్యకారులు మంచి లాభాలు పొందుతున్నారు.

**పర్యాటక కేంద్రంగా..**

1,200 ఎకరాలకు పైగా విస్తరించిన ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట పొడవు దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ కట్టపై నుంచే హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారి ఉంది. నిత్యం ఈ రహదారిపై వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కానీ పెద్ద చెరువు కట్ట వెడల్పు చేసి పర్యాటన కేంద్రంగా మార్చడంలో పాలకులు విఫలమవుతున్నారు. గత సర్కార్ చెరువు కట్టను పర్యాటన కేంద్రంగా మార్చాలని ప్రయత్నం చేసినా సాధ్యపడలేదు. పర్యాటన కేంద్రంగా మారిస్తే ప్రయాణికులు సేద తీరడంతో పాటు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి మంచి ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ చెరువు కట్టపై ఉన్న దర్గా, మైసమ్మ తల్లిని దర్శించుకోవడం కోసం నిత్యం వందలాది మంది వస్తుంటారు. చిర్రు వ్యాపారాలతో వందలాది మంది జీవనోపాధి పొందే అవకాశం ఉంది. ఈ దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్ కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### నీరు పుష్కలం



పెద్ద చెరువులో పుష్కలంగా నీళ్లు ఉండడంతో కరువుఛాయలు కనిపించడం లేదు. దీంతో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లోని బోరుబావుల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. రైతాంగానికి నీటి అంతగా కనిపించడం లేదు.

– బి.మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

### సీఎం దృష్టికి తీసుకెళ్తా



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టను పర్యాటక కేంద్రంగా మార్చడం కోసం కృషి చేస్తా. కట్ట వెడల్పుతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మించేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. ఉన్నతాధికారులతో సమావేశమై అభివృద్ధి విషయంలో నిర్ణయం తీసుకుంటాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం



## చికిత్స పొందుతున్న మహిళ మృతి

మొయినాబాద్: కడుపునొప్పి భరించలేక పురుగుమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీహెచ్. అంజలి(37) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 12న నొప్పి తీవ్రంగా రావడంతో బాధ భరించలేక పు రుగు మందు సేవించింది. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక భాస్కర ఆ స్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శంషాబా ద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసు కెళ్లారు. అక్కడే చికిత్స పొందుతున్న అంజలి గురువారం మృతి చెందింది. మృతురాలికి భర్త యాదయ్య, ఇద్దరు సంతానం. కేసు దర్యాప్తులో ఉంది.

## ఐఎస్ఐ ముద్ర తప్పనిసరి

శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు

శంషాబాద్ రూరల్: ఐఎస్ఐ ముద్ర వినియోగదారులకు భరోసా ఇస్తుందని శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మానక్ ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తువులు కొనే ముందు తప్పనిసరిగా ఐఎస్ఐ ముద్రను పరిశీలించాలన్నారు. హాల్ మార్క్ ధ్రువీకరణ పొందిన బంగారు ఆభరణాలను మాత్రమే ఖరీదు చేయాలని సూచించారు. అలాగే బీఐఎస్ కేర్ యాప్ వినియోగదారులకు ఆయుధం లాంటిదన్నారు. వివిధ రంగాల్లో భారతీయ ప్రమాణాలు, పాటించే విధానం, ఉత్పత్తు ల వారి ప్రమాణాలపై విద్యార్థులకు బీఐఎస్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. భారతీయ ప్రమాణాలపై నిర్వహించిన చర్చా గోష్టిలో విజేతలకు రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో బీఐఎస్ శాస్త్రవేత్త ఏఎస్ఎస్పీ శాస్త్రి, జాయింట్ డైరెక్టర్లు సుజాత, రాకేశ్, ఎస్పీఏ అభిసాయి పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌కు వచ్చిన పత్రాలకు మంట

గ్రామీణ డాక్ సేవక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: పోస్టాఫీస్‌కు వచ్చిన బట్వాడ పత్రాలు సంబంధిత వ్యక్తులకు చేరవేయకుండా గ్రామీణ డాక్ సేవక్ దగ్ధం చేశాడు. ఈ తతంగం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని పోస్టాఫీస్‌లో గ్రామీణ డాక్ సేవక్‌గా శ్రీధర్ విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఆయన విధుల్లో భాగంగా సంబంధిత వ్యక్తులకు పంచాల్సిన ఎల్ఐసీ పత్రాలు, ఆధార్‌కార్డులు, తదితర విలువైన డాక్యుమెంట్లను తగులపెట్టాడు. స్థానిక రైతులు పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకుని వాటిని పరిశీలించారు. అనంతరం శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని పోస్టుమాస్టర్‌కు అప్పగించారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



నవనీత మృతదేహం



ప్రమాదానికి కారణమైన కారు

చేవెళ్ల: అతివేగం ఒకరి ప్రాణాలు తీయగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన చేవెళ్ల పోలిస్‌స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిగూడలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. షాబాద్ మండలం బొబ్బిలిగామకు చెందిన ఆవుల మల్లేశ్, నవనీత(32) దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్యాహ్నం వారు హైదర్‌గూడలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై పయమనమయ్యారు. ఈ క్రమంలో మల్లారెడ్డిగూడ స్టేజి వద్దకు రాగానే వెనుకనుంచి అతివేగంగా వచ్చిన కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. మల్లేశ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నవనీతను చేవెళ్ల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ఆలయ పాలకవర్గంపై కేసు

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ కమిటీ పాలకవర్గం సభ్యులపై ఆదిబట్ల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఆలయ అర్చకుడు ప్రభాకర్‌రావుకు చెందిన 4.6 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జాచేశారని కమిటీ సభ్యులైన దండు వీరస్వామి, నీళ్ల దర్శన్‌గౌడ్, లట్టుపల్లి భూపాల్‌రెడ్డి, దండు సుధాకర్, ఎలుగని భానుచందర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. గతంలో ఈ భూములు దేవాదాయ శాఖ పరిధిలోని రావని తమకు నిజాం కాలం నుంచి వారసత్వంగా వస్తోందని ఘర్షణలు సాగుతున్నాయి. తాజాగా పాలకవర్గ సభ్యులపై కేసులు నమోదయ్యాయి.

## ప్రైవేటు హాస్టల్‌లో యువతి ఆత్మహత్య



సాహితి (ఫైల్)

చైతన్యపురి: చైతన్యపురి పరిధిలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం, అలుబాక గ్రామానికి చెందిన వెంకట సుబ్బారావు కూతురు సుంకర సాహితి (26) ఎంబీఏ పూర్తి చేసింది. రెండు నెలల క్రితం ఉద్యోగాన్వేషణ కోసం నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్‌లని లక్ష్మి ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. బుధవారం సాయంత్రం హాస్టల్ గదిలో సాహితి ఫ్యాన్‌కు ఉరివేసుకొని చనిపోయి ఉండటం గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు, మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలుసులు మృతదేహాన్ని పోస్ట్మార్టంకు తరలించారు. గురువారం తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సాహితి మృతికి ప్రేమ వ్యవహారం కారణం అయి ఉండవచ్చని బావిస్తున్నారు. మృతురాలి కాల్‌డేటా, ఫోన్ చాటింగ్‌లను పరిశీలిస్తే మృతికి గల కారణాలు తెలుస్తాయని తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# డ్రైవర్లే టూరిజం బ్రాండ్ అంబాసిడర్లు

- ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలాజయదేవ్
- 200 మంది క్యాబ్ డ్రైవర్లకు 'అతిథి దేవోభవ' శిక్షణ



శిక్షణకు హాజరైన క్యాబ్ డ్రైవర్లు

శంషాబాద్: ఏ నగరంలోనైనా ఆటో, క్యాబ్ డ్రైవర్లే పర్యాటక రంగానికి నిజమైన బ్రాండ్ అంబాసీడర్లని ఎఫ్‌టీసీసీఐ ( ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ) అధ్యక్షుడు మీలా జయదేవ్ అన్నారు. ఎఫ్‌టీసీసీఐలోని టూరిజం విభాగం ఆధ్వర్యంలో జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఆడిటోరియంలో 200 మంది క్యాబ్ డ్రైవర్లకు 'అతిథి దేవోభవ' పేరిట గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులు ప్రధానంగా ఆధారపడేది డ్రైవర్లపైనే అని అన్నారు. అతిథులతో ప్రవర్తన, మర్యాద, హుందాతనం, భాషా పరిజ్ఞానం ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా ఐఐహెచ్ఎం ఆధ్వర్యంలో ప్రవర్తన, స్వీకరణ అంశాలను వివరించారు. అలాగే అపోలో ఆస్పత్రి బృందం ద్వారా సీపీఆర్ చికిత్స చేసే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్, టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, కో-చైర్మన్ డి. రామచంద్రం పాల్గొన్నారు.

# కొరియర్‌లో గంజాయి చాక్లెట్లు

- బిహార్ నుంచి నగరానికి సరఫరా
- కార్మికులు, విద్యార్థులకు విక్రయం
- రెండు వేర్వేరు కేసులలో 21 వేల చాక్లెట్లు స్వాధీనం
- మేడ్చల్ ఎస్ఓటీ దాడిలో ఇద్దరు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: వాహనాలలో గంజాయి సరఫరాపై పోలీసుల నిఘా పెరడగంతో గంజాయి పెడ్లర్లు రూటు మార్చారు. బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి ఉత్తరాధి రాష్ట్రాల నుంచి కొరియర్‌లో గంజాయి చాక్లెట్లను నగరానికి తీసుకొస్తున్నారు. ఆపై వీటిని స్థానికంగా కిరాణా దుకాణాల ద్వారా విద్యార్థులు, నిర్మాణ కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొరియర్‌లో అయితే పోలీసుల తనిఖీలతో పాటు విక్రయం సమయంలో స్థానికులకు ఎలాంటి అనుమానాలు రావని పెడ్లర్లు ఈ మార్గాన్ని ఎంచుకున్నారని మేడ్చల్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ డీ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. తాజాగా రెండు వేర్వేరు కేసులలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.41 వేలు విలువ చేసే 21 వేలకు పైగా గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలివే..

- బీహార్‌కు చెందిన శిబు కుమార్ జీడిమెట్లలోని రామిరెడ్డి నగర్‌కు వలస వచ్చి కిరాణా షాపును నడుపుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఆశించిన స్థాయిలో డబ్బు రాకపోవడంతో గంజాయిని విక్రయించి సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి కిరాణా షాపు మాటున ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు విక్రయించడం మొదలుపెట్టాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు నిందితుడు శిబు కుమార్‌ను అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ. 11,500 విలువ చేసే 150 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- బీహార్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు సీతారాం సింగ్ పతాన్ చెరువు వేంకటేశ్వరా కాలనీలో కిరాణా షాపును నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు చేతి సంచిలో గంజాయి చాక్లెట్లు తీసుకెళ్లి రామచంద్రాపురం, బాలాజీనగర్ ప్రాంతంలోని లేబర్ అడ్డాలలో వలస కూలీలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ, ఆర్సీపురం పోలీసులు నిందితుడు సీతారాం సింగ్‌ను అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.30 వేలు విలువైన 1,960 చాక్లెట్లు (49 ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకున్నారు.

**గాంజా విక్రయిస్తున్న స్టూడెంట్లు..**

పాకెట్ మనీ కోసం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయికి బానిసలైన గణపతినీడి సంతాన్, షాకమూరి తేజేస్‌లు ఆల్విన్ క్రాస్ రోడ్‌లోని ఎస్ఎస్ రాయల్ సూట్ లాడ్జ్ వద్ద విద్యార్థులు, కూలీలకు గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిజాంపేటలోని శేఖర్ పాన్ షాప్, కింగ్ పాన్ షాప్‌లలో నిషేదిత సిగరెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. కూకట్‌పల్లికి చెందిన సీ చంద్రశేఖర్, మియాపూర్‌కు చెందిన కే బాలరాజులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.16 వేలు విలువ చేసే 114 ప్యాకెట్ల నిషేదిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.